జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 7 | జులై | 2026 ◆ పేజీలు : 8



# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణల డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**




**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 6, (ప్రజాజ్యోతి)** రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోం దని, ఇందులో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని

మిగతా 2 లో...

- నిబంధనల పేరుతో వసూళ్ల ఆరోపణలు
- కొలతల పేరుతో పేదలకు చుక్కలు
- బిల్లుల కోసం లబ్ధిదారుల పరేషాన్
- క్షేత్రస్థాయిలో ఏఈల ఇష్టారాజ్యం..?
- కొలతలే కలెక్షన్లకు మార్గమా..?




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో..

5 లో..

# ఏఈల చేతివాటం..?

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం దశలవారీగా తీసుకొచ్చిన నిబంధనలను కొందరు హౌసింగ్ శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు) తమకు అనుకూలంగా మార్చుకుని లబ్ధిదారుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజా జ్యోతి

## జిల్లాలో పర్యటించిన

# రాష్ట్ర పోలీస్ బాస్




- మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం..
- పోలీస్ గెస్ట్ హౌస్, ఏఆర్ డీఎస్పీ నివాస గృహం ప్రారంభోత్సవం
- పోలీసు అధికారులతో సమీక్ష..
- మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, శాంతి భద్రతలపై కీలక ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 6 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించడంతో పాటు హేమచంద్రపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్మించిన పోలీస్ గెస్ట్ హౌస్, ఏఆర్ డీఎస్పీ నివాస గృహాన్ని ప్రారంభించారు. అనంతరం 6వ బెటాలియన్‌ను సందర్శించి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ పరికరాలను పరిశీలించి విపత్తుల సమయంలో

మిగతా 2 లో...

## దమ్మపేటలో భూవివాదం రగడ

# రైతుల కొబ్బరి తోట ధ్వంసం

- న్యాయవాదిపై కేసులు.. న్యాయం చేయాలంటూ డిమాండ్
- చట్టాన్ని గౌరవించాలి.. దౌర్జన్యాలకు తావులేదు... బార్ అసోసియేషన్
- బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావు



**దమ్మపేట, జూలై 6 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని నల్లకుంట భూవివాదం నేపథ్యంలో స్థానిక న్యాయవాది గోళ్ళ భవాని కృష్ణ యాదవ్‌పై అక్రమ కేసులు నమోదు చేయడం, మరోవైపు బడుగు, బలహీన, గిరిజన రైతుల కొబ్బరి తోటలను ధ్వంసం చేయడం వంటి ఘటనలను

మిగతా 2 లో...

- అసలు బకాయిలు రూ.38,508 కోట్లు.. మొత్తం భారం రూ.54 వేల కోట్లా..?
- ఏళ్ల తరబడి చెల్లింపుల జాప్యంతో పెరిగిన డీపీఎస్
- 49 శాతం వాటాదారైన కేంద్రం దృష్టిలో సింగరేణి బకాయిల వ్యవహారం
- పెట్టుబడులు, విస్తరణ ప్రణాళికలపై పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి
- బకాయిల పరిష్కారంపైనే సింగరేణి భవిష్యత్..
- డీపీఎస్, వడ్డీ మాఫీపై కదలిక..?

7 లో..




# బకాయిలపై రూ.15 వేల కోట్ల వడ్డీ..?

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణల డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సంబంధిత అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించామని, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు పూర్తి చేసి తిరిగి అందించిన వెంటనే సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) యాప్‌లో డిజిటైజేషన్ చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో వివరాల నమోదుకు వాలంటీర్ల సేవలను వినియోగించుకుని ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేపట్టి, ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్దేశిత పరిమితికి మించి ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో తప్పుడు సమాచారం సమర్పించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌ను నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ కార్యక్రమ పురోగతిని సమీక్షిస్తున్నామని, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సమావేశం లో సంబంధిత శాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు అడపా లచ్చయ్య దొర మాతృమూర్తికి రాజకీయ ప్రముఖుల నివాళి



**దమ్మపేట, జూలై 6 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు అడపా లచ్చయ్య దొర మాతృమూర్తి అడపా పుష్పావతి పరమపదించడంతో పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు వారి నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు మృతురాలి పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు కూడా పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్‌కుమార్, బుడే, మద్దెల పుల్లారావు, వెలుగోటి మహేష్, కొల్లి శేఖర్, దండాబత్తుల కాంతారావు, నాగరాజు, నడిపల్లి పోలయ్య, చెన్నారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పాత్రికేయులు పెద్ద ఎత్తున హాజరై అడపా పుష్పావతికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కల్పించాలని ఆకాంక్షించారు.

# జిల్లాలో పర్యటించిన రాష్ట్ర పోలీస్ బాస్





(మొదటి పేజీ తరువాయి...)

సిబ్బంది ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలని సూచించారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మణుగూరు పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సహకారంతో నిర్మించిన ఈ నూతన పోలీస్ స్టేషన్ ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందుతాయని అన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరాల నియంత్రణ, దర్యాప్తు, సీసీటీవీ నిఘా, సైబర్ నేరాల విచారణను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం..**

మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి తీవ్ర ముప్పుగా మారుతోందని డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈగల్ ప్రత్యేక విభాగం ద్వారా డ్రగ్స్ నిర్మూలనకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసే ముఠాలపై తీవ్రవాదుల తరహాలో కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**పోలీసు అధికారులతో సమీక్ష..**

హేమచంద్రపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీజీపీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, కాలనీ, వ్యాపార సముదాయం, విద్యాసంస్థల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పెంచాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0ను సమర్థవంతంగా వినియోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి నేరస్తులకు చట్టపరమైన శిక్షలు పడేలా దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీలు, సీఐలు, ఇతర పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## దమ్మపేటలో భూవివాదం రగడ

(మొదటి పేజీ తరువాయి...)

దమ్మపేట బార్ అసోసియేషన్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. బాధితులకు న్యాయం చేయాలని, ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**న్యాయవాదిపై తప్పుడు కేసులు.. బార్ అసోసియేషన్ ఖండన**

స్థానిక న్యాయవాది గోళ్ళ భవాని కృష్ణ యాదవ్‌పై రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని దమ్మపేట బార్ అసోసియేషన్ ఆరోపించింది. దీంతో సమాజంలో ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం జరిగిందని పేర్కొంది. అంతేకాకుండా, వారి కుటుంబ సభ్యులకు చెందిన భూమిలో సుమారు 250 కొబ్బరి చెట్లను ధ్వంసం చేయడం, భూమిలోకి వెళ్లవద్దని హెచ్చరించడం, కోర్టులో సివిల్ వివాదం కొనసాగుతున్నప్పటికీ అందులో పోలీసులు జోక్యం చేసుకుని ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొంది.తనకు ప్రాణహాని ఉందని, న్యాయం చేయాలని గోళ్ళ భవాని కృష్ణ యాదవ్ బార్ అసోసియేషన్‌కు వినతిపత్రం సమర్పించగా, దీనిపై బార్ అసోసియేషన్ హాలులో అత్యవసర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.

**రికార్డులు పరిశీలించిన న్యాయవాదులు**

సమావేశంలో భవాని కృష్ణకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించిన న్యాయవాదులు, ఆయనకు జరిగిన అన్యాయాన్ని ఏకగ్రీవంగా ఖండించారు. ఆయనపై నమోదు చేసిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్పీ, డీఎస్పీని కలిసి వినతిపత్రం అందించాలని నిర్ణయించారు.అవసరమైతే కోర్టు విధులను కూడా బహిష్కరిస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని భూ రికార్డులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాదులు ఉడతనేని శ్రీనివాసరావు, మారం సతీష్‌కుమార్ బాబు, లక్కినేని నరేంద్రబాబు, గద్దల అప్పారావు, తీర్నాటి సంజయ్, టి. అరుణ్‌కుమార్, నల్లపు ఉదయ్‌కుమార్, తమా బాలరాజు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ధ్వంసమైన కొబ్బరి తోటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా**

దమ్మపేట మండలం నల్లకుంట గ్రామంలోని సర్వే నంబర్ 273/1లో బడుగు, 



బలహీన, గిరిజన రైతులు బొగ్గం శివ, మల్లా కమల, గోళ్ళ సీతారావమ్మ, గోళ్ళ వెంకటేశ్వర్లు, గట్ల సర్వేశ్వరరావు, జంగాల వెంకటేశ్వరరావుకు చెందిన కొబ్బరి మొక్కలను ఆదివారం అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు సోమవారం ఘటనా స్థలాన్ని సందర్శించారు.ధ్వంసమైన తోటలను పరిశీలించి బాధిత రైతులను పరామర్శించిన ఆయన, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**'వివాదాలు చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలి'**

ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, భూవివాదాలు ఉంటే కోర్టులు, చట్టబద్ధమైన మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని, అర్ధరాత్రి వేళ రైతుల పంటలను ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.బడుగు, బలహీన, గిరిజన రైతులను బెదిరించడం, వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. అధికారులు వెంటనే ఘటనపై సమగ్ర విచారణ జరిపి రికార్డుల ప్రకారం అసలైన రైతులకు న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు తాము అండగా ఉంటామని, వారిని ఎవరైనా వేధిస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, గాజుబోయిన ఏసుబాబు, పాశం ప్రసాద్, వెలుగోటి మహేష్, సందీప్ తదితర నాయకులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో రాష్ట్రస్థాయి సోషల్ మీడియా సెమినార్

- ఈ నెల 8న అక్షయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహణ
- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సహా ప్రముఖుల హాజరు
- జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) పిలుపు



**టేకులపల్లి, జూలై 6 (ప్రజాజ్యోతి):** డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావం, బాధ్యతాయుత జర్నలిజం, ఫేక్ న్యూస్ నియంత్రణ, ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర వంటి సమకాలీన అంశాలపై రాష్ట్రస్థాయి సెమినార్‌ను ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు భద్రాచలంలోని అక్షయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ వెల్లడించింది. ఈ మేరకు సోమవారం టేకులపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ వై.పాషా, డివిజన్ సహాయ కార్యదర్శి రాయల ప్రశాంత్, డివిజన్ కార్యవర్గ సభ్యులు టి.సందీప్, టి జయంత్, గుడిపూడి నరేష్ సెమినార్ విశేషాలను వివరించారు. సోషల్ మీడియా వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో దాని సానుకూల, ప్రతికూల ప్రభావాలు, తప్పుడు ప్రచారాలను గుర్తించే విధానాలు, డిజిటల్ మీడియా భవిష్యత్తు, సమాచార ప్రసారంలో మీడియా బాధ్యత, ప్రజల్లో మీడియా విజ్ఞానాన్ని పెంపొందించే అంశాలపై ప్రముఖ నిపుణులు ఈ సదస్సులో ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానుండగా, టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బి.వి. రమణారెడ్డి, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అంకిత్, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డీఎస్పీ అరుణ్ కుమార్, ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేందర్ కుమార్, హెచ్‌ఆర్ జీఎం శ్యామ్ కిరణ్ తదితరులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. సెమినార్ అనంతరం టీయూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీతో పాటు నూతన డివిజన్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా రంగాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ సమావేశంలో యూనియన్ సభ్యులు సీహెచ్ సర్వేష్, బి. దస్రు, మోహన్ బాబు, రామ్ చందర్, ఉపేందర్ రావు, శ్రీకాంత్, వెంకటేష్, సరిలాల్, సాయి కృష్ణ, రాజేశ్వర రావు, సుధాకర్ పాల్గొన్నారు.

# టీఐసీసీఐ జిల్లా కో-కన్వీనర్‌గా బాదావత్ సురేష్ నియామకం

- గిరిజన పారిశ్రామికవేత్తల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఆకాంక్ష



**టేకులపల్లి, జూలై 06, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలానికి చెందిన బాదావత్ సురేష్‌ను ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఐసీసీఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కో–కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు టీఐసీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. శ్రీనివాస్ ధరావత్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాదావత్ సురేష్ జిల్లాలో గిరిజన పారిశ్రామికవేత్తల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, యువత, మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రుణాలు, సబ్సిడీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, స్టార్టప్ అవకాశాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. గిరిజన సమాజ ఆర్థిక సాధికారత, పారిశ్రామికాభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమర్థ వినియోగానికి టీఐసీసీఐ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నూతన బాధ్యతల్లో బాదావత్ సురేష్ విజయవంతంగా సేవలందించాలని టీఐసీసీఐ తెలంగాణ రాష్ట్ర శాఖ శుభాకాంక్షలు తెలియజేసింది.

# జనజాగరణ యాత్రను విజయవంతం చేయాలి

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ టేకులపల్లి మండల శాఖ పిలుపు



**టేకులపల్లి, జూలై 06, ప్రజాజ్యోతి:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 11న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త జనజాగరణ బస్సు యాత్రను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ టేకులపల్లి మండల శాఖ పిలుపునిచ్చింది. సోమవారం మండలంలోని బోడు రోడ్డులో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ 2004 నుంచి నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఉద్యోగి జీతంలో 10 శాతం, అదే మొత్తాన్ని ప్రభుత్వం జమ చేసి ఎన్‌పీఎస్ ట్రస్ట్ ద్వారా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతోందని, పదవీ విరమణ అనంతరం అప్పటి నిధుల విలువ ఆధారంగా పెన్షన్ నిర్ణయించబడుతుందని తెలిపారు. దీంతో ఉద్యోగులకు లభించే పెన్షన్ చాలా తక్కువగా ఉండటంతో వృద్ధాప్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు కోసం 2016 నుంచి సంఘం ఆధ్వర్యంలో నిరంతర ఉద్యమాలు కొనసాగుతున్నాయని, ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ చేపట్టిన జనజాగరణ బస్సు యాత్ర ఈ నెల 11న భద్రాచలం నుంచి ప్రారంభమై కొత్తగూడెం మీదుగా సాయంత్రం ఇల్లందుకు చేరుకుంటుందని తెలిపారు. మండలంలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మూడు రమణ, నాగునాయక్, బాలాజీ, మోహన్, హాతీరామ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తొలగించిన మహనీయుల విగ్రహాలు పునః ప్రతిష్ఠాపన చేస్తాం

- మహనీయుల స్ఫూర్తితో అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీ నే
- బిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ



**అశ్వాపురం, జూలై 6, ప్రజాజ్యోతి** అశ్వాపురం మండల కేంద్రంలో సెంటర్ డివైడర్ పై తొలగించిన విగ్రహాలను రాబోయే బిఆర్ఎస్ ప్రభుత్వంలో మళ్లీ అదే స్థానంలో పునఃప్రతిష్టిస్తామని బిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన యువజన నాయకులతో కలిసి విగ్రహాలు తొలగించిన ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరు ఎన్ని కలలు కన్నా మళ్ళీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు కొంతమంది నాయకుల ప్రోద్బల్యం తో అశ్వాపురంలో సెంటర్ డివైడర్ పై ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలు తొలగించి తాత్కాలిక ఆనందం పొందుతున్నారని, ఈ ఆనందం ఎక్కువ కాలం నిలవదని, ఏ విగ్రహాలు అయితే తొలగింపబడ్డాయో అదే మహనీయుల స్ఫూర్తితో మళ్ళీ అధికారంలోకి వస్తామని, ఎంతమంది అడ్డం వచ్చినా అదే స్థలంలో మళ్లీ తొలగించిన విగ్రహాలను పునః ప్రతిష్టిస్తామని వారు అన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మరుక్షణం ప్రభుత్వ అనుమతితో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఎన్టీఆర్, వై ఎస్ రాజశేఖర్ రెడ్డి, దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, ప్రొఫెసర్ జయ శంకర్, కాళోజీ, కొమురం భీం వంటి తదితర మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు ఒకపక్క వంత పడటం మానేసి విగ్రహాలను పునః ప్రతిష్టించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కమిటి సభ్యులు, నజీర్ షోను, మందా హుస్సేన్, బండ్ల కృష్ణ, ఊకె సతీష్, బేతం రాజకుమార్, పర్స సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సీహెచ్‌సీలో అనుదీప్ జన్మదిన వేడుకలు





**చర్ల, జూలై 06: (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు గతంలో కలెక్టర్‌గా సేవలందించిన అనుదీప్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో పాత్రికేయులు, వైద్యుల బృందం ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు జవ్వాది మురళీకృష్ణ, బొబ్బిలిపాటి రవికిరణ్, జి. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో మండల ప్రజలు చిన్నచిన్న వైద్య అవసరాలకే భద్రాచలం, కొత్తగూడెం వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అనుదీప్ చొరవతో చర్ల సీహెచ్‌సీలో వైద్యుల నియామకం, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే ప్రస్తుతం ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని అనేక రకాల శస్త్రచికిత్సలు సైతం స్థానికంగానే నిర్వహించే స్థాయికి ఆసుపత్రి అభివృద్ధి చెందిందని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధిలో సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్ కీలక పాత్ర పోషించారని అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీహెచ్‌ఎస్) రవిబాబు కూడా చర్ల సీహెచ్‌సీ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం ప్రతిరోజూ 200 నుంచి 300 మంది రోగులు ఆసుపత్రికి వచ్చి అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకుంటూ వైద్య సేవలని పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్ల జాప్యం సరికాదు

- బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, జూలై 06 (ప్రజా జ్యోతి ):** రాష్ట్రంలో 57 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులందరికీ వెంటనే ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ, 57 ఏళ్లు నిండిన అర్హులకు ఆసరా పెన్షన్లు మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వం సూచనల మేరకు ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకుని, అవసరమైన ధ్రువపత్రాలను పంచాయతీ కార్యదర్శులకు సమర్పించినప్పటికీ ఇప్పటికీ పెన్షన్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. దరఖాస్తుల కోసం ప్రజలు వందల రూపాయలు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం ప్రకటించిన గడువులు అమలు కాలేదని తాతారావు ఆరోపించారు. జూన్ 2న ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ స్పష్టమైన పురోగతి కనిపించలేదని అన్నారు. దీంతో పేదలు పెన్షన్లు, ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తూ నిరాశకు గురవుతున్నారని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 57 సంవత్సరాలు నిండిన లక్షలాది మందికి ఆసరా పెన్షన్లు అందించడంతో పాటు పెన్షన్ మొత్తాన్ని రూ.200 నుంచి రూ.2,000కు పెంచారని గుర్తుచేశారు. వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, వృద్ధులకు ఈ పథకం ఎంతో అండగా నిలిచిందని అన్నారు. పెన్షన్‌తో పాటు అందించే బియ్యం కూడా వారి జీవనోపాధికి ఉపయోగపడిందని అన్నారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ నెలకు రూ.4,000 ఆసరా పెన్షన్‌ను తక్షణమే అమలు చేసి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని దొడ్డి తాతారావు కోరారు.


## ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి





**చర్ల, జూలై 06(ప్రజా జ్యోతి )**:భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా చర్ల మండల బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూప రమేష్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత అఖండత పరిరక్షణతో పాటు జమ్మూ కాశ్మీర్ సంపూర్ణ విలీనానికి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చేసిన పోరాటం ఆయన చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టి దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.జయంతి వేడుకలలో భాగంగా డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ స్మారకార్థం చర్ల మండలంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజ శ్రేయస్సు లక్ష్యంగా ఈ హరిత కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి. సందీప్, యువమోర్చా నాయకులు పి. వినయ్, నూప లక్ష్మణ్, వి. రమేష్, పి. జోగారావు, కె. వెంకటేశ్వర్లు, కె. సోమరాజు, ఈ. జయంత్‌తో పాటు మండల కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతికి నాంది..



- నేడు బంజారాల తొలి పండుగ 'సీత్లా భవాని'
- టేకులపల్లి మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వేడుకలు
- పంటల సిరిసంపద.. పశుసంపద క్షేమం కోసం ప్రత్యేక పూజలు
- డప్పుల సవ్వడిలో బంజారా నృత్యాలు.. రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు
- గిరిజన వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆషాఢ మహోత్సవం





**టేకులపల్లి, జూలై 06ప్రజాజ్యోతి:** గిరిజన బంజారా సమాజానికి తొలి పండుగగా భావించే సీత్లా భవాని మహోత్సవం నేడు టేకులపల్లి మండలంలోని అన్ని బంజారా తండాల్లో భక్తిశ్రద్ధలతో జరగనుంది. బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, పశుసంపదపై ఆధారపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచిన ఈ పండుగ ప్రతి ఏడాది ఆషాఢ మాసంలోని పునర్వసు కార్తెలో నిర్వహించడం ఆనవాయితీ. తెలుగు ప్రజలకు ఉగాది ఎంత విశిష్టమో, బంజారా సమాజానికి సీత్లా భవాని పండుగ అంతే ప్రాముఖ్యత కలిగి ఉంది. వర్షాకాలం ప్రారంభమైన వేళ పంటలు సమృద్ధిగా పండాలని, పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉండాలని, గ్రామాల్లో సుఖశాంతులు నెలకొనాలని కోరుతూ సప్తమాతృకలైన మేరామా, తొల్జా, మంత్రాల్, కంకాళీ, హింగ్లా, ద్వాళ్లాగర్, సీత్లా భవానీలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి తండాలో నాయక్, కరోభారి ఆధ్వర్యంలో బెల్లం అన్నం, ఘుగ్రీ (గుగ్గిళ్లు), లాప్షి (పాయసం), ఉల్లిగడ్డలు, ఎండుమిర్చి, పూలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లిస్తారు.పండుగలో భాగంగా డప్పుల సవ్వడుల మధ్య మహిళలు రంగురంగుల సంప్రదాయ బంజారా వస్త్రధారణలో వెండి ఆభరణాలు ధరించి వలయాకారంలో నృత్యాలు చేస్తూ జానపద గీతాలు ఆలపిస్తారు. పూజల అనంతరం నిర్వహించే 'దాటుడు' ఆచారం ఈ పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దేవతల ఆశీస్సులతో పశుసంపదకు వ్యాధులు దరిచేరవనే విశ్వాసంతో పశువులను ప్రత్యేక పూజల అనంతరం దాటిస్తారు.సీత్లా భవాని పండుగ కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాదు. బంజారా సంస్కృతి, ఐక్యత, సామాజిక బంధాలు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే మహోత్సవం. అయితే ఆధునికత ప్రభావంతో తండాల్లో సంప్రదాయాలు క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో బంజారా వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని గిరిజన పెద్దలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు.నేడు మండలంలోని అన్ని తండాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనుండగా,తండాలన్నీ ఆధ్యాత్మిక శోభతో పాటు జానపద కళలు, గిరిజన సంస్కృతికి వేదికగా మారనున్నాయి.

## ఓటరు సర్వేను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్





**చర్ల, జూలై 06 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని కందిపాడు, వెంకటచెరువు గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని డిప్యూటీ కలెక్టర్ మురళి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఓటరు నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.వలస ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని బీఎల్ఓలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఒక్క ఓటు కూడా మిస్ కాకుం డా సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.గ్రామాల్లో నిరక్షరాస్యత అధికంగా ఉన్న నేపథ్యంలో బీఎల్ఓలు అందజేసే దరఖాస్తు ఫారాలను పూ రించడం పలువురికి ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. అలాంటి వారికి చదువుకున్న వ్యక్తులు సహకరించి ఫారాలను సక్రమంగా పూర్తి చేయించేలా అవగాహన కల్పించాలని కోరారు.ఓటు హక్కు ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సర్వే నిర్వహణలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే డివిజన్, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని బీఎల్ఓలకు సూచించారు.

## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి






**ఇల్లందు, జూలై 6 (ప్రజా జ్యోతి )** నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని చెన్నంగుల గడ్డ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి నామ నాయక్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా చెన్నంగలగడ్డ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. మొక్కలను పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- నిబంధనల పేరుతో వసూళ్ల ఆరోపణలు
- కొలతల పేరుతో పేదలకు చుక్కలు
- బిల్లుల కోసం లబ్ధిదారుల పరేషాన్
- క్షేత్రస్థాయిలో ఏఈల ఇష్టారాజ్యం..?
- కొలతలే కలెక్షన్లకు మార్గమా..?




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో..

# ఏఈల చేతివాటం..?

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం దశలవారీగా తీసుకొచ్చిన నిబంధనలను కొందరు హౌసింగ్ శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు) తమకు అనుకూలంగా మార్చుకుని లబ్ధిదారుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజా జ్యోతి**

ప్రభుత్వం మొదట ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి పరిమితులు విధించకుండా వెసులుబాటు కల్పించగా, అనంతరం నిర్మాణ వ్యయం అదుపు తప్పకుండా ఉండేందుకు దశలవారీగా నిబంధనలను కఠినతరం చేసింది. అయితే ఈ మార్పులనే కొందరు అధికారులు ఆదాయ మార్గంగా మార్చుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు..!**

ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమైన సమయంలో లబ్ధిదారులు తమ అవసరాలకు అనుగుణంగా ఇళ్లను నిర్మించుకునే అవకాశం కల్పించారు. ఇంటి ముందు, పక్క భాగాల్లో ఎంత మేర స్లాబ్ వేయాలన్న దానిపై ప్రత్యేక ఆంక్షలు లేకపోవడంతో చాలామంది భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అదనంగా స్లాబ్‌లు నిర్మించుకున్నారు. అనంతరం ప్రభుత్వం రెండో సారి ఉత్తర్వులు జారీ చేసి ఇంటి నిర్మాణ విస్తీర్ణానికి పరిమితిని విధించింది. ఈ దశ నుంచే క్షేత్రస్థాయిలో కొందరు ఏఈలు తమ చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇళ్ల కొలతలు నిబంధనలకు మించి ఉన్నాయని, బిల్లులు మంజూరు కావని, రికార్డుల్లో ఇబ్బందులు వస్తాయని లబ్ధిదారులను భయపెట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు, కొన్ని ప్రాంతాల్లో రూ.10 వేల వరకు డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం. డబ్బులు చెల్లించిన వారి ఫైళ్లను వేగంగా ముందుకు పంపడం, ఇవ్వని వారి బిల్లులను పెండింగ్‌లో ఉంచడం వంటి ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**కొత్త నిబంధనలను బూచిగా చూపిస్తూ..**

ఇటీవల జూన్ 27న ప్రభుత్వం మరో జీఓ జారీ చేసి స్లాబ్ విస్తీర్ణంపై మరింత స్పష్టమైన నిబంధనలు తీసుకొచ్చింది. ఇంటి ముందు భాగంలో మూడు అడుగులు, మిగిలిన మూడు వైపులా ఒక్క అడుగు వరకు మాత్రమే స్లాబ్ విస్తరించాలని, 600 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా ఉన్న ఇంటికి గరిష్ఠంగా 750 చదరపు అడుగుల స్లాబ్ మాత్రమే ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే ఈ నిబంధనలు ప్రస్తుతం ఆర్ఎల్, బీఎల్, గ్రౌండింగ్, ఇంకా నిర్మాణం ప్రారంభించని ఇళ్లకు వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం నిర్మాణ వ్యయం తగ్గించి లబ్ధిదారులు అప్పుల పాలుకాకుండా చూడడానికేనని ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ నిబంధనలను కూడా కొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నిర్మాణం ప్రారంభమైన ఇళ్లలో కొన్ని చోట్ల స్లాబ్ వేయాల్సి ఉండగా, కొత్త జీఓ వచ్చిన తర్వాత స్లాబ్ పనులు చేపట్టారు. అయితే ఈ కొత్త నిబంధనలు ఇప్పటికే నిర్మాణం కొనసాగుతున్న ఇళ్లకూ వర్తిస్తాయని చెబుతూ, స్లాబ్ కొలతల పేరుతో లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. "నిబంధనలు దాటారు... బిల్లు ఆగిపోతుంది... సమస్య పరిష్కరించాలంటే ఖర్చు అవుతుంది" అంటూ కొందరు ఏఈలు ఒత్తిడి తెస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు.

**జిల్లా అధికారులు స్వయంగా పరిశీలిస్తే..**

ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే ఇటీవల బిల్లులు మంజూరైన ఇళ్లను జిల్లా స్థాయి అధికారులు స్వయంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. స్లాబ్ పూర్తయిన ఇళ్ల వద్ద తీసుకున్న కొలతలు, మంజూరైన బిల్లులు, క్షేత్రస్థాయి నమోదు వివరాలను సరిపోల్చితే నిబంధనల అమలు సక్రమంగా జరిగిందా, లేక లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారా అన్నది స్పష్టమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇటువంటి ఆరోపణలు నిజమైతే అది ప్రభుత్వ లక్ష్యానికే విఘాతం కలిగించే అంశమని స్థానికులు పేర్కొంటున్నారు. అందువల్ల ఇటీవల బిల్లులు మంజూరైన ఇళ్లన్నింటిపైనా జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.





## బడుగు బలహీన వర్గాల ప్రజల ఆరాధ్యుడు జగ్జీవన్ రామ్

**- డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 6, (ప్రజా జ్యోతి )** పేద, బడుగు, బలహీన, అణగారిన వర్గాల ప్రజల ఆరాధ్యుడు ఆశా కిరణం జగ్జీవన్ రామ్ అని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు భారతదేశ మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా కొత్రాలతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత సంఘాల నాయకులు, పలువురు పట్టణ ప్రముఖులు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ దేశంలోని బడుగు వర్గాల ప్రజలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికపరంగా, సముచిత స్థానం లభించినప్పుడే ఆయన ఆత్మ కి శాంతి చేకూరుతుందన్నారుదేశంలో సమ సమాజ స్థాపన కోసం జగ్జీవన్ రామ్ చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు ,ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు, సీరపు సుగుణ, నాయకులు మహిపతి రామలింగం, దండోరా శ్రీను, బండి లక్ష్మణ్, వై.వెంకటేశ్వరరావు, ఎస్.కె భాష, బండి నాగరాజు, బూసి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొలికపోగు కాంతారావు మాదిగ**



**దమ్మపేట, జూలై 6(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, సంస్థ జెండాను ఆవిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కొలికపోగు కాంతారావు మాదిగ పిలుపునిచ్చారు.దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామ గ్రామాన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడంతో పాటు, ఆయన జన్మదిన వేడుకలను కూడా ఘనంగా నిర్వహించాలని కోరారు. ఉద్యమం ప్రారంభమై 32 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గత రెండేళ్లుగా ఎస్సీ వర్గీకరణ అమలు ఫలితాలు ప్రజలకు అందుతున్న నేపథ్యంలో, వాటిపై అవగాహన కల్పిస్తూ ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేపట్టాలని సూచించారు.ఎస్సీ వర్గీకరణ అమలు వల్ల రాష్ట్రంలో మాదిగల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని, ఈ విజయానికి ఉద్యమకారుల పోరాటమే కారణమని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చాటేలా ప్రతి కార్యకర్త బాధ్యతగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొలికపోగు కాంతారావు మాదిగతో పాటు రవి మాదిగ, ముసలయ్య మాదిగ, అశోక్ మాదిగ, పుల్లారావు మాదిగ, వీరయ్య మాదిగ, పోలయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యాలకు 'మేవా' ఆర్థిక సాయం



**బూర్గంపహాడ్,జులై 6,(ప్రజా జ్యోతి):**మండలంలోని సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్(మేవా) వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం బూర్గంపహాడ్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరికీ వైద్య ఖర్చులకోసం రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ ఆశ అనే మహిళ నోటి క్యాన్సర్ అని నిర్ధారణ కాగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ చికిత్స అందిస్తున్నారు.గత డిసెంబర్ నెలలో ఈమెకు మేవా ద్వారా పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించగా ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడటంతో మరోసారి వైద్య ఖర్చుల నిమిత్తం ఆశకి మేవా వెల్ఫేర్ సొసైటీ తరుపున మరోసారి రూ. 5వేలు,మండల కేంద్రంలోని గౌతంపురం కానీ చెందిన షేక్ మహబూబ్ అలీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా మేవా ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తమ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా, గ్రామ పెద్దలు షేక్ దస్తగిరి, మహమ్మద్ ఇమ్రాన్, సోహెల్ పాషా, ఖమర్, అబ్దుల్ సలీమ్, రెహమాన్,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల నిలయంగా బూర్గంపహాడ్ ప్రభుత్వ ఆసుపత్రి

- ఏజెన్సీ ప్రాంతంలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలి.
- నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించాలి
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు.



**బూర్గంపహాడ్,జులై 6, (ప్రజా జ్యోతి):**మండల కేంద్రమైన బూర్గంపహాడ్ లోని 30పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాథమిక వైద్యశాలగా మారిందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం,రాయల వెంకటేశ్వర్లు, వై అప్పారావు బృందంగా వెళ్లి ఆసుపత్రిని పరిశీలించారు.ఈ సందర్భంగా రోగులను , వైద్య సిబ్బందిని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బూర్గంపహాడ్ 30పడకల ప్రభుత్వ ఆసుపత్రి నూతన బిల్డింగ్ వెంటనే ప్రారంభించాలని కోరారు. సమస్యల నిలయంగా ప్రభుత్వ ఆసుపత్రి మారడంతో వైద్యం అందక పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. డిప్యుటేషన్ పై వచ్చిన డాక్టర్లతో, సిబ్బందితో వైద్యం అందించడం విచారకరమని తెలిపారు. పర్మినెంట్ డాక్టర్లను వైద్య సిబ్బందిని నియమించాలని అన్నారు . అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగులు నాణ్యత లోపాలను పర్యవేక్షించడంలో అధికారులు చెందారని దానివల్లే 2026 జనవరిలో అందుబాటులోకి రావాల్సిన నూతన బిల్డింగు నేటికీ అందుబాటులోకి రాకపోవడం జరిగిందని విమర్శించారు.వరద ముంగిట్లో మునిగి ఉన్న ఆసుపత్రికి చుట్టూ ప్రహరీ గోడ నూతనంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆసుపత్రిలో ఎక్స్ రే ,స్కానింగ్ విభాగాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండల ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

# గిరిజన విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

- 2,500 మంది విద్యార్థులకు చేయూత అందించిన సేవా వాహిని



**చర్ల, జూలై 06 (ప్రజా జ్యోతి ):** విద్యకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో శ్రీ నృసింహ సేవా వాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో చర్ల మండలంలోని మారుమూల అటవీ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు సోమవారం ఉచిత విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూరుగుపాడు, కుర్నపల్లి, చింతగుప్ప, ఆర్. కొత్తగూడెం గ్రామాలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు తదితర సామగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమానికి భద్రాచలానికి చెందిన సామాజిక సేవకుడు శ్రీమాన్ కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న పేద విద్యార్థులకు విద్యా పరంగా అండగా నిలవడమే శ్రీ నృసింహ సేవా వాహిని ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇప్పటివరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 2,500 మందికి పైగా నిరుపేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందించి వారి చదువుకు చేయూతనందించామని చెప్పారు. భవిష్యత్తులో కూడా విద్యా అవకాశాలకు దూరంగా ఉన్న విద్యార్థుల వివరాలు తమ దృష్టికి వస్తే వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.అటవీ ప్రాంతంలోని నాలుగు గ్రామాల విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రి అందజేయడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన ఆర్. కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవి, కూరపాటి వీర్రాజు, రూంజా రాజా, బిందు ప్రతాప్, గ్రామ పెద్దలకు ఫౌండేషన్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హరికృష్ణ, అశోక్, ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీతో విజయ్ నాయుడు సమావేశం



**చర్ల, జూలై 06(ప్రజా జ్యోతి ):**చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు సోమవారం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు బలరాం నాయక్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ భేటీలో చర్ల మండలంలోని కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, స్థానిక ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత పటిష్ఠం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వాటిని అర్హులకు చేరేలా కృషి చేయాలని ఎంపీ బలరాం నాయక్ సూచించినట్లు విజయ్ నాయుడు తెలిపారు.అదేవిధంగా చర్ల మండలానికి సంబంధించిన పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన విజయ్ నాయుడి వినతులపై ఎంపీ సానుకూలంగా స్పందించారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## అన్నపురెడ్డిపల్లి సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ కు వినతి

- మూడు నెలలుగా నిలిచిపోయిన సెంట్రల్ లైటింగ్ పనులు
- దుమ్ము, కంకరతో రాకపోకలకు అంతరాయం.. వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు

**అన్నపురెడ్డిపల్లి, జూలై 6 (ప్రజా జ్యోతి ):**అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు మూడు నెలలుగా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు, వాహనదారులు, రహదారి వెంట వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల కోసం రోడ్డును తవ్వి కంకర, రాళ్లు వేసిన తర్వాత నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేయడంతో దుమ్ము విపరీతంగా ఎగిసిపడుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. రహదారి వెంట ఉన్న వ్యాపారులు దుమ్ము కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, గ్రామ ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని గ్రామ సర్పంచ్ లాకవత్ లక్ష్మి , ఉపసర్పంచ్ మారగాని అశోక్, పాలకవర్గ సభ్యులు తెలిపారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. సెంట్రల్ లైటింగ్ పనులను తక్షణమే పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులను ప్రశ్నించగా నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయని వివరణ ఇచ్చినట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. నిధులు వెంటనే విడుదల చేసి పనులను పూర్తి చేయాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉపసర్పంచ్ మారగాని అశోక్, చల్లా రమేష్, రాంబాబు, సుగ్గల నరసింహారావు పాల్గొన్నారు.




## 13న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య



**ములకలపల్లి, జూలై 06(ప్రజాజ్యోతి):** పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాగులో ఉన్న మిగిలిన పోడు భూములకు ప్రభుత్వం వెంటనే హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులపై అటవీ శాఖ అధికారులు వేధింపులు, నిర్బంధ చర్యలు నిలిపివేయాలని కోరారు. పోడు భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించిన ఆయన, పోడు సాగుదారులపై నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే దశలవారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పోడియం వెంకటేశ్వర్లు, మళోతు రావూజ, నిమ్మల మధు, గడ్డం వెంకటేశ్వర్లు, కీసరి అదెయ్య, గుగులోతు దేవ తదితరులు పాల్గొన్నారు.

- అసలు బకాయిలు రూ.38,508 కోట్లు.. మొత్తం భారం రూ.54 వేల కోట్లా..?
- ఏళ్ల తరబడి చెల్లింపుల జాప్యంతో పెరిగిన డీపీఎస్
- 49 శాతం వాటాదారైన కేంద్రం దృష్టిలో సింగరేణి బకాయిల వ్యవహారం
- పెట్టుబడులు, విస్తరణ ప్రణాళికలపై పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి
- బకాయిల పరిష్కారంపైనే సింగరేణి భవిష్యత్..
- డీపీఎస్, వడ్డీ మాఫీపై కదలిక..?




# బకాయిలపై రూ.15 వేల కోట్ల వడ్డీ..?

**సింగరేణి కాలరీస్ కంపెనీకి తెలంగాణ విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన బకాయిల వ్యవహారం కొత్త మలుపు తిరుగుతోంది. ఇప్పటికే అసలు బకాయిలు రూ.38,508 కోట్లకు చేరగా, డిలేడ్ పేమెంట్ సర్‌చార్జీ (డీపీఎస్), వడ్డీ కలిపి మొత్తం బకాయిలు రూ.54 వేల కోట్లకు చేరినట్లు విశ్వసనీయ సమాచారం అందుతోంది.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి :**

అసలు బకాయిలతో పోలిస్తే దాదాపు రూ.15 వేల కోట్లకు పైగా అదనపు భారం కేవలం వడ్డీ, డీపీఎస్ రూపంలోనే పేరుకుపోయినట్లు తెలుస్తోంది.

**ఎలా పెరిగింది ఈ భారీ భారం..?**

బొగ్గు సరఫరా ఒప్పందాల్లో నిర్ణయించిన గడువులో చెల్లింపులు జరగకపోతే విధించే అదనపు మొత్తాన్నే డిలేడ్ పేమెంట్ సర్‌చార్జీ (డీపీఎస్)గా పరిగణిస్తారు. దీనికి తోడు ఒప్పంద నిబంధనల మేరకు వడ్డీ కూడా లెక్కిస్తారు. బకాయిలు ఎంతకాలం పెండింగ్‌లో ఉంటే, అంతకాలం ఈ భారం పెరుగుతూనే ఉంటుంది. అందుకే అసలు బకాయిలతో పోలిస్తే వేల కోట్ల రూపాయల అదనపు ఆర్థిక భారం ఏర్పడినట్లు తెలుస్తోంది. అయితే సింగరేణి జెన్‌కో, ట్రాన్స్‌కోలకు ఒకేసారి రూ.38 వేల కోట్ల విలువైన బొగ్గు సరఫరా చేయలేదు. గత రెండు దశాబ్దాలుగా ప్రతి నెలా, ప్రతి ఏడాది బొగ్గు సరఫరా కొనసాగుతూనే ఉంది. దానికి అనుగుణంగా బిల్లులు జారీ అవుతున్నాయి. నిర్ణీత గడువులో చెల్లింపులు జరగకపోతే వాటిపై డీపీఎస్, వడ్డీ అమలులోకి వస్తుంది. పాత బిల్లులు పెండింగ్‌లో ఉండగానే కొత్త బిల్లులు చేరుతుండటంతో వాటిపైనా మళ్లీ డీపీఎస్ పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలే ప్రస్తుతం భారీ ఆర్థిక భారంగా మారినట్లు సమాచారం.

**కేంద్రం దృష్టిలో బకాయిల వ్యవహారం..**

జూన్–2026 నాటికి సింగరేణికి రావాల్సిన అసలు బకాయిలు రూ.38,508 కోట్లు కాగా, అందులో తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో వాటానే దాదాపు 95 శాతం ఉన్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థలు బకాయిలను దశలవారీగా చెల్లిస్తుండగా, తెలంగాణ విద్యుత్ సంస్థల వద్ద భారీ మొత్తాలు నిలిచిపోవడం వల్లే వడ్డీ, డీపీఎస్ భారం పెరిగినట్లు సమాచారం. ప్రస్తుతం సింగరేణిలో తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం ఈక్విటీ వాటా ఉంది. ఈ నేపథ్యంలో సంస్థ ఆర్థిక పరిస్థితిపై కేంద్రం కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిల పరిష్కారంపై సంబంధిత స్థాయిలో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. బకాయిల కారణంగా సింగరేణి నగదు ప్రవాహం దెబ్బ తింటే బొగ్గు ఉత్పత్తి, పెట్టుబడులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో ఈ అంశాన్ని త్వరగా పరిష్కరించాలని కేంద్ర స్థాయిలోనూ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు వర్గాలు పేర్కొంటున్నాయి.

**సింగరేణికే నష్టమా..?**

బొగ్గు ఉత్పత్తిలో లాభదాయక సంస్థగా కొనసాగుతున్నప్పటికీ, రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో సింగరేణి తన సొంత నిధులతో పాటు అవసరమైన చోట బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని కార్యకలాపాలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. ఈ బకాయిలు ఇదే విధంగా కొనసాగితే కొత్త గనుల అభివృద్ధి, భారీ యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, భూసేకరణ, కార్మిక సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన పెట్టుబడులపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పెద్ద సవాలుగా మారింది. సింగరేణికి రావాల్సిన అసలు బకాయిలు మాత్రమే కాకుండా, వాటిపై పేరుకుపోతున్న డీపీఎస్, వడ్డీ భారం కూడా రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బకాయిల చెల్లింపుపై త్వరితగతిన నిర్ణయం తీసుకోకపోతే ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని, ఫలితంగా సింగరేణి ఆర్థిక వ్యవస్థతో పాటు రాష్ట్ర విద్యుత్ రంగంపైనా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని సంస్థ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### డీపీఎస్, వడ్డీ మాఫీపై కదలిక..?

అయితే ఈ వ్యవహారంలో మరో కీలక కోణం కూడా తెరపైకి వస్తోంది. జెన్‌కో, ట్రాన్స్‌కో, సింగరేణి మూడు ప్రభుత్వ రంగ సంస్థలే కావడంతో డీపీఎస్, వడ్డీ రూపంలో రావాల్సిన మొత్తాన్ని పూర్తిగా లేదా పాక్షికంగా మాఫీ చేసే ప్రతిపాదనలపైనా ప్రభుత్వ స్థాయిలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే ఈ మొండి బకాయిలు, దాంతోపాటు వాటిపై రావాల్సిన వడ్డీ లెక్కలపై అధికారిక సమాచారం ఇచ్చేందుకు సింగరేణి అధికారులు ఎందుకో వెనకడుగు వేస్తున్నారు. ఈ అంశంపై పూర్తి వివరాలతో తదుపరి కథనం.

## ఎంపీడీవోను సన్మానించిన సర్పంచులు



**ములకలపల్లి, జూలై 6 (ప్రజాజ్యోతి):** ములకలపల్లి మండలానికి నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను సోమవారం మండలంలోని పలువురు సర్పంచులు మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యలు, గ్రామ పంచాయతీలకు సంబంధించిన పలు అంశాలను సర్పంచులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రమేష్, సర్పంచులు గడ్డం సుజాత, మడకం విజయ, తుర్రం శ్రీను, కుంజా రవి, ధర్మ, తానం పద్మ, మడకం రవి, కొరస ఆదిలక్ష్మి , కల్లూరి కిషోర్, కారం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రొత్త ఓట్లను చేర్పించే బాధ్యత బి.ఎల్.ఓ,బి.ఎల్.ఏ లదే

**డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**

**కార్పొరేటర్ విమలాదేవి**



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 6,( ప్రజాజ్యోతి )** క్రొత్తగా ఓట్లను చేర్పించే బాధ్యత ఆ బూత్ కు సంబంధించిన బి.ఎల్.ఓ, బి.ఎల్.ఎ లదే అని డి.సి.ఎం. ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచలోని ఓటర్ల నమోదు కార్యక్రమాన్నికొత్వాల, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి సోమవారం లు సమీక్షించారు. ఈ సందర్భంగా 46వ డివిజన్ పరిధి మైసమ్మ తల్లి దేవాలయం వద్ద జెండాల బజారులో, ఆయా ప్రాంతాలలోని ఓటర్లతో నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కొత్వాల మాట్లాడుతూ బి.ఎల్.ఓ ,బి.ఎల్.ఎ లు, ఓటర్ వద్దకు వెళ్లి సర్ ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణకు సహకరించేలా కృషి చేయాలన్నారు. ఈనెల 24 లోపు 100 శాతం నమోదు అయ్యేలా ఓటర్లు సహకరించాలని కొత్వాలఅన్నారు. ఈ కార్యక్రమంలో 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమాలాదేవి, బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఎ.లు చందార్కర్, వరుణ్, షేక్ ఖాజామియా,మసనం శరత్, సి.పి.ఐ నాయకులు రెహమాన్, బూసి శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

## మందుల విక్రయ నిబంధనల ఉల్లంఘన కేసు..

**వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష...పదివేలు వేల జరిమానా**



**దమ్మపేట, జూలై 6(ప్రజాజ్యోతి ):** డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం–1940 నిబంధనలను ఉల్లంఘించిన కేసులో నిందితుడికి మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. భవాని తీర్పు వెలువరించారు.కోర్టు రికార్డుల ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన మార్తా పెద్దిరాజు చట్ట విరుద్ధంగా మందుల విక్రయాలకు పాల్పడినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ తనిఖీల్లో గుర్తించారు. దీనిపై డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్–1940లోని సంబంధిత నిబంధనల ప్రకారం ఫిర్యాదు నమోదు చేసి, 2024లో దమ్మపేట కోర్టులో అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్. శ్రీధర్ సాక్ష్యాధారాలు, పత్రాలను న్యాయస్థానం ముందుంచి వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించింది.దీంతో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్–1940లోని సంబంధిత సెక్షన్ల కింద నిందితుడు మార్తా పెద్దిరాజుకు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష విధించడంతో పాటు రూ.10 వేల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు శిక్షను కూడా అనుభవించాల్సి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.ఈ తీర్పుతో మందుల విక్రయానికి సంబంధించిన చట్టాలు, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని మరోసారి స్పష్టమైనట్లు న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి

## వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- సీపీఐ మండల కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్



**ములకలపల్లి జూలై06, (ప్రజాజ్యోతి):** వలస ఆదివాసీలకు వెంటనే ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సీపీఐ ములకలపల్లి మండల కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ ఆధ్వర్యంలో ధర్మానగర్, కొమరం భీమ్ నగర్‌కు చెందిన వలస ఆదివాసీలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ, గతంలో కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వలస ఆదివాసీలకు ప్రస్తుతం ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేయడం సరికాదన్నారు. విద్యార్థుల చదువుల కోసం వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు, నివాస గృహాలకు ఇంటి నెంబర్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 25 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తూ రేషన్ కార్డులు, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉన్నప్పటికీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుడే చుక్కయ్య, పొడియం బుర్ర, పొడియం దేవా, సుడే నరేష్, మడకం భీమా తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలకు సబ్ సెంటర్ల కేటాయింపుకు కౌన్సెలింగ్ నిర్వహణ

- డి ఎం అండ్ హెచ్ ఓ తుకారాం రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 6, (ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని పలు ఆరోగ్య ఉప కేంద్రాల్లో రెగ్యులర్ ఏఎన్ఎంలు విధుల్లో చేరిన నేపథ్యంలో, ఖాళీగా ఉన్న ఉప కేంద్రాలకు ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలను కేటాయించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని సోమవారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించారు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తిగా సీనియారిటీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఉప కేంద్రం లో ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు, నూతనంగా కేటాయించిన ఉప కేంద్రాల్లో ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలు వెంటనే విధుల్లో చేరి, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు, చిన్నారులకు అవసరమైన ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా వైద్య సేవలు అందేలా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సూపరింటెండెంట్ డిప్యూటీడెమో నాగలక్ష్మి డిపిఎంవో మోహన్, హెల్త్ సూపర్వైజర్లు శ్రీనివాసరావు, రాంప్రసాద్, జానకి సుశీల ఉమాదేవి విజయలక్ష్మి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

- డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు



**టేకులపల్లి, జులై 06, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని శంభుని గూడెం ముర్రేడువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టేకులపల్లి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం సోమవారం ఉదయం సుమారు 7 గంటలకు తడికెలపూడి ఎక్స్‌రోడ్డు వద్ద టేకులపల్లి ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, శంభునిగూడెం ముర్రేడువా గు నుంచి ఇల్లందు వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను ఆపి తనిఖీ చేశారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మాలోత్ సురేందర్ (23), తండ్రి పాప, మంగ్య తండా, కొత్తతండా (గ్రామం) నివాసి, ట్రాక్టర్ యజమాని బానోత్ శంకర్, తండ్రి మంగ్య, మంగ్య తండా, కొత్తతండా (గ్రామం) నివాసిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి పోలీసులు హెచ్చరించారు.

# ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 6 (ప్రజా జ్యోతి)**





ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం తక్షణమే సంబంధిత శాఖ అధికారులు వాటినే పరిష్కరించే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు, సోమవారం ఐ డి ఓ సి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి ప్రజలు నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిశీలించిన కలెక్టర్ వివిధ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు . ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా అధికారులు పనిచేయాలని సూచించారు, ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులు....సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామానికి చెందిన సంఘం నాగేశ్వరరావు, తన తండ్రి మరణించడంతో ఆయన పేరుపై ఉన్న పట్టా భూమిని వారసత్వ హక్కు ప్రకారం తన పేరుకు మార్చాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి, తదుపరి చర్యల కోసం సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం రాజు తండా గ్రామానికి చెందిన అజ్మీర రవి, కొత్తగూడెం–ఇల్లందు జాతీయ రహదారి విస్తరణలో తన ప్రహరీ గోడతో పాటు మూడు గదుల ఇల్లు కోల్పోతున్నందున తగిన నష్టపరిహారం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి, అవసరమైన చర్యల కోసం టేకులపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం ఇందిరానగర్‌కు చెందిన పోతరాజు రమేష్, గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతూ, 50 శాతం వైకల్యం ఉన్నందున కుటుంబానికి ఆర్థిక ఆధారం లేక చికిత్స భారంగా మారిందని పేర్కొంటూ వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును జిల్లా కలెక్టర్ పరిశీలించి, తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారికి ఎండార్స్ చేశారు. బూర్గంపహాడ్ మండలం ఎదుళ్ల చెరువు గ్రామానికి చెందిన దుర్గాల వెంకటేశ్వర్లు, తాను 2000 సంవత్సరం నుంచి సాగు చేస్తున్న 1 ఎకరం 50 సెంట్ల పోడు భూమిలో సాటిలైట్ పాయింట్ మంజూరైందనే కారణంతో అధికారులు సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని, ఆ భూమికి సంబంధించి సర్వే కూడా పూర్తయిందని పేర్కొంటూ వ్యవసాయం కొనసాగించేందుకు అనుమతి కల్పించాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి, తగు చర్యల కోసం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ

- అనాథ మహిళ మృతదేహానికి అంతిమ సంస్కారాలు





**దమ్మపేట, జులై 6(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జమేదారు బంజర పరిసర అటవీ ప్రాంతంలో జూలై ఒకటవ తేదీన గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన నేపథ్యంలో, సోమవారం గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మృతదేహాన్ని గుర్తించిన స్థానిక పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతురాలి వివరాలను గుర్తించేందుకు పలు ప్రయత్నాలు చేసినప్పటికీ, బంధువులు లేదా కుటుంబ సభ్యులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మృతదేహాన్ని అనాథగా గుర్తించిన పోలీసులు అంత్యక్రియల నిర్వహణ కోసం మందలపల్లి గ్రామానికి చెం దిన గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారాన్ని కోరారు. పోలీసుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన సంస్థ సభ్యులు మానవత్వాన్ని చాటుతూ, మందలపల్లి పంచాయతీ కార్యదర్శి, పోలీసుల సమక్షంలో అనాథ మహిళ మృతదేహానికి గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఎవరూ లేని అనాథ మృతదేహాలకు సైతం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పాలడుగుల అబ్బులు, షేక్ అజీమ్, రొయ్యల కుమార్, జేసీబీ సోము తదితరులు పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు.

## శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు.. పోటెత్తిన భక్తులు

- మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహణ
- హెచ్‌సీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం





**అన్నపురెడ్డిపల్లి, జులై 6 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ఆలయంలో సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పండ్ల రసాలు తదితర ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఆ తర్వాత ధూపసేవ, నాగహారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. హెచ్‌సీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో మంతెన కేశవరాజు సత్యనారాయణ సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి రెవెన్యూ శాఖ ఆర్ఐ, శాఖ సిబ్బంది, కృష్ణయ్య, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, అన్నదానం, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించబడ్డాయి.